# పరివర్తనం

[జూపూడి పున్నా రావు]

(ఫిలింజర్నలిస్ట్సు అసోసియేషన్)

నీకప్పుడే పెండ్లి కూడ అయింది కదు బావా! ఓ అమ్మాయికప్పుడే మొగుడయ్యావన్నమాట'' అని అంది చిరునవ్వుతో కమల.

"పెళ్లి-ఆ...అయింది-'' అన్నాడు విసుగ్గా వేణు.

"ఏం. అట్లా అంటావు బావా!''

''ఎందుకొచ్చిన పెండ్లియిది కమలా! నేను మూడో ఫారం చదివేటప్పుడు అయింది. అప్పుడు నాకెన్నేళ్లో తెలుసా? పద్నాలుగు".

''చిన్నతనంలో పెండ్లి కావటం గూడ అదృష్టమే కదూ! ఏమంటావు బావా?''

"ఏమంటాను-అఘోరిస్తూ జీవితమంతా సంతోషమనేది లేకుండ గడుపుతానంటాను."

''ఎందుకు బావా అలాఅంటావు ?-చక్కని పెండ్లాం దొరికినందుకా!''

''చక్కంది ... ఎవరికన్నా చక్కంది. నన్ను చూస్తే ఎగతాళి నీకు'' అని చిన్నబుచ్చుకున్నాడు.

''ఇక అననులే బావా! నీకు కోపం తెప్పించాను.''

''కోపం దేనికి కమలా! నీవేమన్నావని. అంతా నాదురదృష్టం" ప్రక్కకు తల త్రిప్పుకున్నాడు.

ఇంతలో కేక వినిపించింది.

''అదుగో అత్తయ్య పిలుస్తుంది. వెళ్తా బావా'' అని చేతిమీదగీరి కమల వెళ్లిపోయింది.

వేణువళ్లు పులకరించింది. అనేక భావాలు రేకెత్తాయి. చనువుగా స్త్రీ ప్రవర్తిస్తే పురుషుడికి ఆలుసెక్కుతుంది. ఏవేవో ఆలోచనలు ఒక్కసారి దొర్లాయి.

''కమలకింకా పెండ్లవలేదు. సంబంధాలు చాలా వస్తున్నాయి. రేపో-మాపో పెండ్లి జరుగుతుంది. కాని తన ప్రేమంతా వృథా. అప్పుడే తనకుమాత్రం పెండ్లయింది. తండ్రి చనిపోయేముందు తన పెండ్లి చూడాలని ఆశవల్ల ... పెండ్లి చేశేసి-కక్కుర్తిగా ... తన ముద్దుముచ్చట్లు తీర్చుకుని తృప్తిపడి గతించాడు. ఆయన ఆత్మ శాంతించింది. కాని-తన ముద్దుముచ్చట్లు ఎవరికీ అవసరం లేకపోయింది.''

పెద్దవాళ్లు చనిపోయేటపుడు ఎవరినో ఒకరిని దుఃఖాలపాలుచేసి పోవటం ప్రపంచంలో మామూలువాడుక అయింది.

''ఇంతవరకు చదువు పూర్తి లేదు. పెండ్లి ఒకటి రెండు నెలల్లో భార్య కాపురానికి వస్తుంది. చిన్నతనంలో ... ప్రపంచమంతే ఏంటో తెలియని వయస్సులో పెద్దభారాన్ని నెత్తినవేసి యావజ్జీవితం మోయమని శాసించి వెళ్ళాడు తండ్రి. అప్పుడే సంసారం పెండ్లాం-బిడ్డలు-అంతా భయంకరంగా ఉంది. వేణు గుండె బరువెక్కింది. బరువెక్కిన హృదయంతో తన గది చేరుకుని కుర్చీలో పడుకుని కళ్లు మూసాడు. కండ్ల నిండా దృశ్యాలే. కమలతో చిన్నతనంనుంచి ఒక కంచాన తిని...ఒక మంచాన పరుండి...స్వేచ్ఛగా...సంతోషంగా జీవితం గడిపాడు.

కొద్దిరోజుల్లో ఆకమల మరొక పురుషుడికి... పరిచయంలేని మరోవ్యక్తికి భార్య కాబోతుంది. కమలకిష్టమయి తేమట్టుకు—తనకు భార్యఉండగా తెలివిగల ఏ స్త్రీ తనను పెండ్లాడదు. స్త్రీలు భర్త ప్రేమను ఇతరులు పంచుకుంటుంటే చూచి ఓర్వలేరని అందరికి తెలుసు. లోకంమాత్రం ఏమంటుంది. కమల తల్లిదండ్రులు...ఎంత తెలివిమాలిన పని మాత్రం చేయరు. కమలనుండి తన ప్రేమను తిప్పుకోవాలి—తనకు సాధ్యమా-ఈపని తన జీవితంలో చేయలేడేమో...

*   *   *

కమలకార్యమై నెలరోజులు కావొచ్చింది. వేణు హృదయంలో తుపాను చెలరేగింది.... రేపో...మాపో కమల అత్తవారింటికి వెళ్లబోతుంది. ఇదివరకుమల్లే తనకు కమల కనబడదు. ఆమె యవ్వనాన్ని...లేత అందాన్ని...చూచి ఆనందిస్తూ విచారాలన్నీ మాయంచేసుకుంటున్నాడు. ఆమె చిలిపి చేష్టలు...చిలకపలుకులు అతనికి దూరమౌతవి. కమల యికనుంచి భర్త చాటున...భర్త చెప్పుచేతల్లో .... అత్త అదమాయింపుల్లో నలగవలసిన అమాయకురాలు. కమల అత్తవారింటికి వెళ్ళినతర్వాత తనకు అక్కడకు వెళ్ళే పనేముంటుంది? వెళ్లితే—తనివిదీర ఆమెను చూచేందుకు భర్త సహిస్తాడా. అసభ్యపుపని...

కమల తన జీవితం నిర్జీవంచేసింది. కాదు-కమలకాదు కన్నతండ్రే చేశాడాపని. కమల అందంముందు తన భార్య- సూర్యునిముందు దివిటీ- ఆ టక్కరిమాటలు ... మనసు వంచే చూపులు ... తాపమెత్తించే చేష్టలు తన భార్యకేం తెలుసు. పట్టి అనాగరికురాలు.

కమల వచ్చింది. వేణు కమలవేపు దీనంగా చూశాడు. అతనిలో వెనుకటి ఉత్సాహం...ఓర్పు...లేదు.

"అలాఉన్నావేం బావా? సుస్తీచేసిందా"

"ఏంలేదు కమలా!... మరిచాను. నీవు కొద్దిరోజుల్లో అత్తవారింటికి వెళ్తావుగదూ"

"వెళ్లవద్దు బావా! అప్పుడే ఆయన ఉత్తరం వ్రాశాడు ఈరోజు-త్వరగా పంపమని"

వేణు మనస్సు మెలికలు తిరిగింది. కమల భర్తకెందుకు అంత తొందర. అవును. కార్యమయ్యాక భార్యను పుట్టినింటఉంచడం బాధ్యతగల ఏభర్తకు న్యాయంకాదు నూతన దంపతులకు ఆమాత్రంఅనురాగముంటడంలో విశేషమేముంది. తన కార్యమవగానే తల్లి భార్యను తీసుకరాలేదు!

"నేను జ్ఞాపకముంటానా కమలా!" అన్నాడు జాలిగా.

"అదేం బావా? అట్లాఅంటావు. అందరికన్నా నీవేనాకెప్పుడు జ్ఞాపకముంటావు. నీఫోటో ఒకటి తీసుకెళ్తుతా. ఇవ్వవూ?"

ఫోటోకావాలి...తనే—జ్ఞాపకముంటాను వేణుహృదయం కొట్టుకుంది.

"ఫోటో ఎందుకులే-తరువాత కొత్తది తీయించుకునిపంపుతాను" అని తప్పుకున్నాడు మెల్లగా.

ఇద్దరూ కొద్దిసేపు నిశ్శబ్దంగాఉన్నారు.

"బావా! నీవే నన్ను అత్తారింటికి తీసుకెళ్లాలి. సరేనా"

వేణు చిక్కులోపడ్డాడు. తనే తీసి కెళ్లాలిట. ఆపని తన చేతులమీదుగా చేయటం...తన మనస్సెట్లా ఒప్పుకుంటుంది. తప్పేముంది. ఆడపిల్లను అత్తవారింటికి పంపటంలో తప్పులేదు. కాని — మనస్కరించడంలేదు. మార్గంలో ఆమె నిండుయవ్వనాన్ని ....చిందే అందాన్ని చూచేభాగ్యం దొరికింది. తప్పుకుంటే—?

"ఎవరన్నారు కమలా?"

"మా నాన్నే. రేపే ప్రయాణం. గుడ్డలూ...అవీ సర్దుకు"

"...........''

"నే సర్దనా బావా?" అంది చిరునవ్వుతో.

అత్తవారింటికి—కాదు—భర్త దగ్గరికి వెళ్ళాలంటే స్త్రీకెంత ఆనందమో... ఆరాటమో...కోరికో...అతనికి తెలిసింది. తాను ఈర్ష్యపడుతున్నాడా? సముద్రాన్ని చేరటం నదికెట్లానో భర్తను చేరటానికి భార్యకు స్వభావసిద్ధమయిందే.

"నాకు అర్జంటుపనులున్నాయికమలా? లేకపోతే వద్దును. మీనాన్నను తీసికెళ్లు" అన్నాడు ఇష్టంలేక.

"ఈరాత్రికే నాన్న కోర్టు పనిమీద ఊరికెల్తున్నాడట. నాల్గురోజులకుగాని గాడు. నాతో నిన్నే పంపుతానన్నాడు. సరేనా!"

"—పోనీ నాల్గు రోజులుండి పోగూడదూ?"

"వద్దు బావా! ఆయనకు కోపం వస్తుంది. తప్పక వెళ్లాలి" అని కమల పనిమీద వెళ్లిపోయింది.

వేణుకు ముందు నుయ్యి...వెనుక గొయ్యి. ఎటూ తప్పేటట్లు లేదు తనకీ ప్రయాణం...

*   *   *

రైలు ఆగింది. కమల...వాళ్లు దిగవలసిన స్టేషను తరువాతది. పెట్టెలోఉన్న ఇద్దరు రైతులు...ఒక స్త్రీ తన చంటిపిల్లతో సహా దిగిపోయారు. వేణు, కమల—ఇద్దరే పెట్టెనిండా కూర్చున్నారు. బండిబయల్దేరింది. కమల కిటికీగుండా పచ్చని పైరుల్ని చూస్తూ తాము దిగే స్టేషను ఎప్పుడొస్తుందా అనే ఆరాటంతో చూస్తుంది. పక్షులు పైరు చేలల్లో వాల్తున్నాయి. గాలికి పైరు ఆడుకుంటుంది. ముఖంమీదపడ్డ వెంట్రుకల్ని చేత్తో సవరించుకుంటూ అట్లానేచూస్తుంది. గాలికి తొలిగిన పైటలోంచి ఎత్తయిన వక్షస్థలాన్ని చూస్తున్నాడు వేణు. అతని హృదయంలో ఆరాటం ఎక్కువయింది. శరీరం పులకరించింది...రోమాలు నిక్కపొడుచుకున్నై... వేడిరక్తం అన్నినాడుల్లోకి పరుగెత్తింది... గుండెవేగం ఎక్కువయింది. కూర్చున్నచోటులోంచి లేచాడు. కమల ప్రక్కన కూర్చుని 'కమలా' అని పిలిచాడు. ఆమాట "బోయ్, బోయ్" అనివస్తున్న గాలి తరంగాల్లో కలిసిపోయి కమలకు వినిపించనేలేదు.

"కమలా..." అన్నాడు పెద్దగా.

"ఏం...బావా! వచ్చే స్టేషన్‌కతూ మనం దిగేది''

వేణుమాటలు ఆమెకు అపశ్రుతిగా వినిపించలేదు.

'ఆ—' అన్నాడు. కమల మరల కిటికీలోంచి చూస్తుంది. కొంచెంసేపుండి 'కమలా' అన్నాడు. ఉద్రేకంగా దగ్గుత్తికతో. కళ్లల్లో కామం తొనికిసలాడుతుంది.

"ఏం బావా!" అంది చిరునవ్వుతో.

"నామీద ప్రేమలేదా కమ...'' చెయ్యిపట్టుకున్నాడు.

వేణు ముఖంలోకిచూచి "నీ వంటే నాకెంతో ప్రేమ బావా!"

''మరి నీవు ప్రేమించినవాణ్ణి వదిలి పోతున్నావేం!"

"ఏం వెళ్లితే ప్రేమించగూడదా?''

అదికాదు—నీ అందాన్ని...యవ్వనాన్ని అనుభవించేభాగ్యం...'' దగ్గరకు జరిగాడు.

''ఛీ! ఏం మాటలుబావా ఇవ్వాళ-" అవతలికి జరిగింది. ముఖం ఎఱ్ఱబారింది.

"కమలా! ఇదేనా ప్రేమ...ఉందన్నావ్...."నిరాశతో చూస్తూ.

''ఆ. వుందిబావా! నీవు వరసకు బావవైనా స్వంత అన్న కన్నా ఎక్కువగా ప్రేమిస్తున్నా. నీప్రేమ ఏంటో ఇప్పుడు తెలిసింది. కామాన్ని చల్లార్చుకునేందుకు నటించే కృత్రిమప్రేమని'' కళ్లెఱ్ఱబడ్డాయి.

''కమ...నీ ప్రేమకోసరం ఇంతవరకూ నా భార్యను ... కాని ... చిన్నతనంనుండి చూపుతూన్న ప్రేమ నిజస్వరూపం బయటబడింది.''

"ఛీ! వెధవప్రేమ. నీకూ భార్య ఉందిగా. ఆ ఇల్లాలు నిన్నుగురించి ఎంత బాధ అనుభవిస్తుందో. భార్యను హింసిస్తున్న నీ ముఖం—నీ భార్యను ప్రేమించరాదూ? ఆరోజు...నా దగ్గర కంట నీరుపెట్టుకుంది. కాని-ఆమె మనోబాధ గుర్తించలేక నీతో... ఒక సోదరుడనేభావంతో చనువుగా ప్రవర్తించాను. అందుకే నీమనస్సు పలచనయిపోయింది. స్త్రీని అలుసుచేశావు''"కమలా-'' తలవంచుకున్నాడు. కళ్లల్లో తుపాను చెలరేగింది. అతనిభావాలు పిచ్చివయిపోయినయి. బండీలోంచి దూకి పారిపోదామనుకున్నాడు. కమలముఖం అతని సిగ్గుముఖం చూడలేకపోయింది. తన పొందేబాధ కండ్లఎదుట కనబడింది. అతనికళ్లు ఏడ్చాయి.

''ఊరుకోబావా! కోపంతో అన్న మాటలు నొప్పిగలిగించాయా'' కన్నీరు తుడుస్తూ అంది.

లేదమ్మాయి. ఇకముందునన్నెప్పుడూ 'బావా' అని పిలవద్దు.

కమల కండ్లు చెమ్మగిల్లాయి.

"ఊరుకో అమ్మాయి.'' తన చేతి గుడ్డతో ఆమెకళ్లు తుడిచాడు.

రైలు కూత కూసింది...కమలముఖం చిరునవ్వు నవ్వింది...బండి స్టేషన్‌లో ఆగింది....ఆ ఖాళీపెట్టెలో మనుష్లు ఎక్కుతున్నారు.